# వేణీ సంహారం

"అంతట మదాంధుడైన ఆ దుశ్శాసనుడు ద్రౌపదీ అమ్మవారి కొప్పు చేత బట్టుకొని బరబరా లాగడం మొదలుపెట్టాడు. మహాసాధ్వి పాంచాలి అవమానంతో, సిగ్గుతో, దుఃఖంతో, భయంతో ఆత్మరక్షణ కోసం పెనుగులాడుతూ, శక్తిదాలక తూలిపోతూ, వాలిపోతూ, అవస్థపడుతూ అడుగులు వేస్తూంది. ఆ సమయమున ....

హరికథ మంచి జోరుగా సాగుతోంది. ముందు వరసలో కూర్చున్న మఃజమ్మ ఆశ్చర్యంగా అద్భుతంగా హరిదాసుగారి వైపు చూస్తూ ఆయన చెప్పే

ఆసక్తికరమైన కథ వింటూ మనోనేత్రంతో చెబుతున్న కథ జరుగుతున్నట్లుగా అనుభూతి పొందుతోంది.

ద్రౌపది జుట్టు దుశ్శాసనుడు పట్టుకున్నాడనగానే ఆమెకి ఒళ్ళు గగుర్పొడిచింది. తల పంకించింది జారుగా వేసుకున్న ఆమె బరువైన ముడి వదులై పాయలుగా, కొండ మీంచి దూకే జలపాతంలా మెడ మీంచి, వీపు మీంచి జారి నేలని తాకింది. మణమ్మ చటుక్కున తన జుట్టు చేతుల్లోకి తీసుకుని మూడు మడతలు వేసి, మళ్ళీ ముడి పెట్టుకుంది. అది ఆమె వీపుమీద పెద్దముంత బోర్లించినట్లుగా ఉంది. తల కదిపితే జారిపోతున్న తన ముడి గట్టిగా ఉందో లేదో మరోసారి చూచుకొని మణమ్మ మళ్ళీ హరికథలో పడిపోయింది.

*　　　*　　　*

మణమ్మ తలకట్టు చూసి ఆశ్చర్యపడనివారుండరు. ఈర్ష్యపడనివారుకూడా ఉండరు. ఏ పోషణా, ఆలనాపాలనా చెయ్యలేని మణమ్మకి అంత ఒత్తుగా, నల్లగా, పొడుగ్గా జుట్టు ఎలా పెరిగిందా అని అంతా ఆశ్చర్యపోతుంటారు.

ఆమె ఏ షాంపులూ వాడదు. ఏ కేశతైలాలూ వాడదు. వాడేందుకు స్తోమతేదీ? పొట్టకూటికై పొద్దస్తమానూ పనిచేసుకునే మణమ్మకి ఒక్కొక్కసారి ఆ అందమైన తలకట్టు భారమైపోతూ ఉంటుంది.

ఆ రోజు తెల్లారి లేచేసరికి తల భారంగా, పచ్చిపుండులా ఉంది. జుట్టు చేత్తో పట్టుకుంటే విపరీతమైన నొప్పిగా ఉంది.

అప్పుడు మణమ్మ కళ్ళల్లో నీరూరింది. రాత్రి చెల్లయ్య తాగివచ్చి చేసిన భాగోతమంత గుర్తుకొచ్చింది.

డబ్బులడిగితే లేదంది - ఇల్లంతా వెదికాడు ట్రంకుపెట్టెలో ముంతలో దాచిన డబ్బులు పట్టుకున్నాడు తీసుకుపోయి రాత్రి తాగివచ్చాడు. "నా కాడ అబద్ధమాడి డబ్బులు దాస్తావంటే? నీకెన్ని గుండెలు? నీ మొగుడుకంటే ఎవడే నీకు ఎక్కువ" అంటూ నానా బండబూతులు తిట్టాడు. మణమ్మ తిట్టింది. ఏడ్చింది. విదిలించింది. మణమ్మ జుట్టు చెల్లయ్యకి చాలా అనువుగా దొరికింది. జారిపోయే ప్రసక్తిలేదు. అరచేతిమీదుగా రెండు చుట్లు చుట్టి ఒడిసి పట్టుకున్నాడు.

మణమ్మ పైప్రాణాలు కడగంటిపోయాయి. విపరీతమైన బాధతో విలవిల్లాడి పోయింది. కానీ తప్పించుకోలేకపోయింది. చెల్లయ్య దొరికినచోటల్లా కొట్టాడు. ఒళ్ళు హూనమైంది. వాడు చేతిలో జుట్టు వదిలేసరికి కుప్పలా మంచంలో కూలి పోయింది.

తెల్లారి లేచేసరికి బాగా పొద్దుపోయింది. లేస్తూనే ట్రంకు పెట్టెమీద పెట్టిన తలనొప్పి బిళ్ళ, పక్కనే హోటలు నుంచి తెచ్చిన టీ గ్లాసు కనిపించేసరికి ఏడుపాగింది కాదు. ఏడుస్తూ లేచి ముఖం కడుక్కుంది. ఆ బిళ్ళ మింగింది. టీ వెచ్చబెట్టుకుని తాగింది మంచంమీద వెల్లకిలా పడుకుంది కొండచిలువలా ఆమె జుట్టు బరువుగా మంచం కిందకి జారి నేలపై పరుచుకుంది.

మొగుడి గురించి ఆలోచిస్తున్న మణమ్మకి ఏమీ అంతుపట్టకుండా ఉంది - 'తణ్ణి వదిలేసి ఒంటిగా వున్నా ప్రాణం సుఖంగా ఉంటుంది' అని చాలాసార్లు అనుకుంది. కాని అది కుదరటంలేదు

తాగి తప్పు చేస్తాడు. నిషా దిగాక నీరు కారిపోతాడు కష్టం కనిపెడతాడు. రాత్రి కొట్టినందుకేడ్వాలో, తెల్లారేసరికి టీ నీళ్ళతో మందు బిళ్ళ సిద్ధం చేసినందుకు ఆనందపడాలో మణమ్మకి అర్థం కావడంలేదు.

నాలుగిళ్ళలో పనులుచేసి పదిరాళ్ళు సంపాదించుకునే మణమ్మది అతి సాధారణ జీవితం. చదువులేదు. కొండలనంటే ఆశలు లేవు. కడుపునిండా తిండి, కంటి నిండా నిద్ర, ఒంటి నిండా బట్ట మాత్రమే కోరుకునే పేదమనసుకి ప్రతీక మణమ్మ. కానీ ఆమె బతుకు రోజురోజుకి దుర్భరమైపోతోంది.

చెల్లయ్య తాగకపోతే మంచివాడే. మనసున్నవాడే తాగితే మాత్రం రాక్షసుడు. అతనిచేత తాగడం మానిపించాలని ఎన్నో ప్రయత్నాలు చేసి దెబ్బలు తింది మణమ్మ, కానీ ఫలితం లేకపోయింది.

నెమ్మదిగా ఓపిక చేసుకుని ప్రమీలమ్మగారింటికి బయలుదేరింది ఆ ఒక్క ఇంట్లో పనిచేస్తే కాఫీ, టిఫిను, అన్నం, కూరలు అన్నీ వస్తాయి. అందుకే శక్తి లేకపోయినా బయలుదేరింది

గుమ్మంలోనే ఎదురైంది ప్రమీల "ఏమే మణీ .... ఇంతాలస్యంటే! పాచి గుమ్మంలో ముగ్గు వెయ్యలేదని మా అత్తగారు గొడవ. ముగ్గువేస్తేగానీ అయ్యగారు బయటకెళ్ళకూడదట! ఏమిటి?" అంటూ ఇంకా ఏమో అనబోయి -

"ఏమైంది? మీ ఆయన తాగొచ్చి మళ్ళీ కొట్టాడా?" అంది. ఆమె అడగటం చాలా సాధారణంగా అడిగినా మణమ్మకి మనసులో గుచ్చుకుంది - అవమాన భారంతో ఒక్కసారి కృంగిపోయింది. సమాధానం చెప్దామంటే మాటకంటే ముందు కళ్ళనీళ్ళొచ్చాయి

"సరి సర్లే .... లోపలికి పోయి ముందు పని చూసు. రెండు ఇడ్లీలు పెడతా తిని, కాఫీ తాగు" అంటూ ఆమె మణమ్మతో కలిసి లోపలికొచ్చింది.

మణమ్మ చకచకా పనిచేసుకుపోతూ ఆలోచిస్తోంది. తలవంచితే భారంగా, పచ్చిపుండులా ఉంది. జుట్టుముడి వేయాలని పట్టుకుంటే భరించలేని బాధగా ఉంది. ఆలోచించి చివరికి ఒకటే అనుకుంది.

'ఈవేళ అయ్యకి అమ్మకి చెప్పాలి. ఉంటే మంచి గుండాలి లేదా నా మానాన నన్ను బతకనియ్యాలి' అంతే!

గట్టిగా అనుకుంది మణమ్మ కాస్త పనిపూర్తయిన తర్వాత ప్రమీల తీరుబడిగా వచ్చి కూర్చుని మణమ్మతో మాటలు మొదలు పెట్టింది.

"ఏమే .... మణీ నాకు తెలీకడుగుతాను - వాడు నిన్నలా కొట్టిచంపుతుంటే నువ్వు వాణ్ణే పట్టుకుని వేళ్ళాడతావేమే" అంది.

నిజానికి మణమ్మ కూడా అదేవిధంగా ఆలోచిస్తున్నా, అదేమాట అమ్మగారు అడిగేసరికి ఆత్మాభిమానం దెబ్బతింది.

"అదేంటమ్మగారూ ... మొగుడు కదా! అంత సులువుగా వదిలేయడం కుదురుతుందా" అంది.

"అది కాదే. వాడు మంచిగా ఉంటే ఫర్వాలేదు ఏం నీ కష్టం నీవు పడుతున్నావ్. నీ పొట్ట నువ్వు పోషించుకుంటున్నావ్."

అయితే మాత్రం తాళికట్టినోడు తన్నినా పడిఉండాలంటారు కదండి."

"ఎవరే ఆ మాట అనేది? బుద్ధిలేనివాళ్ళు, కొట్టి చంపేస్తుంటే. కళ్ళు చూడు ఎలా వాచిపోయాయో."

మరింక మణమ్మ కళ్ళనీళ్ళు ఆగలేదు. అవి జలజలా రాలాయి. "ఛా.... ఊరుకో! నాకు కనిపించనీ .... నాలుగు దులిపేస్తాను వాణ్ణి" మణమ్మ కళ్ళు తుడుచుకుంది.

"వద్దులెండి. మా అయ్యతో చెప్పిస్తాను" అంది.

"అయినా మాలాంటివాళ్ళకి మొగుడ్ని వదిలేయాలంటే కష్టం. కుటుంబాలూ, మర్యాదలూ, సంప్రదాయాలూ అవీ ఇవీ .... నీకేమే" ఈ మాటలు మణమ్మ మనసులో మళ్ళీ పౌరుషాన్ని రేపాయి.

"అదేంటమ్మాగారూ .... మాకూ మర్యాదలుంటాయి. నేను నా మొగుణ్ణి వదిలేసి వచ్చినా, మరొకడిని చేసుకున్నా మాయమ్మ కాలువలో దూకుతానంది. మా అయ్య ఉరేసుకుంటానన్నాడు" అంది దర్పంగా.

"సర్లే .... ఇదో మేళం." ప్రమీల తన పనిలో పడింది.

"అమ్మగారూ .... తలకాయ పుండులా ఉంది అంది మణమ్మ.

"ఏం .... వాడు జుట్టుపట్టుకుని కొట్టాడేమిటి ?"

"మరేనండి, సచ్చినోడు, ఎప్పుడూ వాడి చేతులు నా జుట్టుమీదే" ఆపుకోలేక పోయింది మణమ్మ.

"బాయిలర్‌లో వేణ్ణీళ్ళున్నాయి. అక్కడే గిన్నెలో కుంకుడుకాయ రసం కూడా ఉంది. స్నానం చెయ్యి. మరి రెండు కాయలు వేస్తాను. నీ జుట్టుకి చాల వులే" అంది ప్రమీల దయగా.

ప్రమీల జుట్టు మూడుబెత్తలే ఉంటుంది. సన్నగా, అక్కడక్కడ వంకీలు తిరిగి కొంచెం ఎరుపు ధవళిలో ఉంటుంది. అందుకే ప్రమీలకి మణమ్మ తలకట్టు చూస్తే ఎక్కడలేని ఆశ్చర్యం. ఏ పోషణా చెయ్యదు మణి అయినా దాని జుట్టు అంత వత్తుగా, నల్లగా, మెత్తగా ఎలా ఉంటుంది? అదే సృష్టి రహస్యం. తనెంతో శ్రమపడింది. కోడిగుడ్డు సొన రాసింది. మందారకులు పెట్టి తలంటుకుంది. మందార పూవులతో నూనెకాచి రాసుకుంది. ఉసిరిపప్పు, బావంచాలు ఒకటేమిటి ఎన్ని చేసినా అరంగుళం పెరగలేదు. శ్రమమాత్రం మిగిలింది. ఇక చేసేదిలేక బజారులో అమ్మే మేలురకం తలనూనె వాడటం మొదలుపెట్టింది ఒక్కొక్క సారి ప్రమీలకి విచిత్రమైన ఆలోచన వస్తుంది. ఈ మణమ్మ జుట్టు ఏదైనా తల నూనెకి ఎడ్వర్‌టైజ్‌మెంట్‌కి ఎందుకివ్వకూడదూ అని.

"పన్నెండమ్మగారూ వెళ్తున్నా" అంది మణమ్మ.

* * *

రాత్రి ఎనిమిదిగంటలైనా చెల్లయ్య ఇంటికి రాలేదు. మణమ్మ మనసు ఆందోళనగా ఉంది. మొగుడు ఆలస్యంగా వస్తాడంటే తప్పకుండా తాగివస్తాడు.

తాగి వచ్చాక ఎలాఉంటాడో ఎవ్వరూ చెప్పలేరు. ఒక్కొక్కసారి పూటుగా అన్నం తినేసి బోర్లాపడుకుంటాడు. ఒక్కొక్కసారి ఎప్పటెప్పటి సంగతులో ఎత్తి రభస చేస్తాడు. కొడతాడు. అందుకే మణమ్మకి చెల్లయ్య ఆలస్యంగా ఇంటికొస్తే భయం.

అనుకున్నంతా అయింది. చెల్లయ్య ఇంటికొస్తూనే గావుకేకలు మొదలు పెట్టాడు.

"ఏమే .... నీ బాబొచ్చి నన్ను ఆపుతాడనా ఆడికెళ్ళి చెప్పుకున్నావ్. అల్లె వల్లే మజ్జలో. నా పెళ్ళాన్ని నేకొట్టుకుంటా, నరుక్కుంటా ! మావగాడితో చెప్తే భయపడి నిన్ను కొట్టననుకున్నావా ? ఆడుసెప్తే కొడతానా, ఆడు మానమంటే మానతానా ? అయినా మొగుడు కొట్టాడని అమ్మోళ్ళకి చెప్పడానికి సిగ్గులేదంటే.... నా సామిరంగా ఇప్పుడు సిగపాయ తీసి తంతానే ఎవడొస్తాడో చూస్తా అడ్డు"అంటూ లంఘించుకున్నాడు.

"మరేం చెయ్యను .... ఒళ్ళు గుల్లచేస్తుంటే పడి ఉండటానికి నాకాడ ఊపిరుండద్దా."

"ఆ మాట నాకాడ చెప్పాలే. మీ అయ్యకి పితూరీచెప్తే నేనూరుకుంటానా?"

"ఊరుకోక ఉరేసుకుంటావా ?"

"ఏయ్ - నోరు లేస్తోందే ?"

"ఏంటీ .... పెద్ద పెట్టి పోషించేవోడిలా"

"ఏమన్నావే" చెల్లయ్య మణమ్మ మీదకి దూకాడు.

చటుక్కున తప్పుకుని తలుపుతీసి దాటబోతుండగా వొదుగ్గా జారిన జుట్టు ఒడిసిపట్టుకున్నాడు.

"అమ్మో" అంటూ ఆగిపోయింది మణమ్మ. అంతక్రితంరోజు నొప్పి పూర్తిగా తగ్గకుండానే మళ్ళీ జుట్టు గుంజేసరికి ఆమె ప్రాణం విలవిల్లాడిపోయింది.

చెల్లయ్య మణమ్మ వీపుమీద పిడిగుద్దులు గుద్ది వదిలేసి బయటకెళ్ళి పోయాడు. అరగంటవరకు మణమ్మ గుక్కతిప్పుకోలేకపోయింది పడుకుని ఏడుస్తూనే ఉంది.

చెల్లాచెదరైన ఆమె నల్లని కురులు మంచం తలాటు దిక్కున కాళింది మడుగులా క్రమ్ముకున్నాయి

ఎప్పుడో నిద్రలోకి జారుకున్న మణమ్మ పాల వ్యాను శబ్దం దూరంగా

వినిపిస్తే మెలకువ వచ్చి లేచింది. పూర్తిగా తెల్లవారలేదు. చీకటి వెలుతురు కలనీ వెలసిన కలనేత బట్టలా ఉంది బయట.

మణమ్మ నెమ్మదిగా లేచింది. రాత్రి ఎప్పుడొచ్చాడో చెల్లయ్య నేలమీద గోనెపట్టామీద నిద్రపోతున్నాడు. ఆమె గుడిసె బయటకొచ్చింది. దూరంగా గుడికి ఆనుకున్న కాలవమీంచి చల్లనిగాలి శరీరానికి తగిలి ఒక్క క్షణం అలౌకిక మైన సుఖాన్నిచ్చింది. మణమ్మ స్థిరంగా కాలవవైపు నడిచి ముఖం కడుక్కుంది. అప్పుడే గుడి తలుపులు తీస్తున్నారు.

కళ్యాణకట్ట దగ్గర అపుడే సామాను సర్దుకుని కూర్చున్న మాదయ్య దగ్గిర కూర్చుని తల వంచింది. అతను వెంకటేశ్వరుడికి దణ్ణంపెట్టి కత్తెర చేతులోకి తీసుకున్నాడు మణమ్మ వంచిన తలకింద రెండు నయాగరాలు పొంగాయి. "ఈ జుట్టే లేకపోతే వాడు నన్ను పట్టిపట్టి కొట్టలేడు" అనుకుంది అమాయకంగా.

బొడ్డులోంచి రెండు రూపాయలు తీసి మాదయ్య చేతిలోపెట్టింది. కాలవలో స్నానంచేసి దేవుడికి దణ్ణం పెట్టుకుంది.

ప్రమీలమ్మగారింటి గేటు దాటుతుంటే పాలకుర్రాడు చూసి ఫక్కుమని నవ్వబోయి లెంపలేసుకున్నాడు.

"అయ్యో ... అదేమిటే నీ ఇల్లు బంగారంగానూ, ఎంత పని చేశావే" అంది ప్రమీల.

"మా ఆయన మనసు మారాలని తలనీలాలు సామికి మొక్కుకున్నానండి." అని అందమైన ఆత్మాభిమానంగల అబద్ధమాడింది మణి.

మణమ్మ దేవుడిని అడ్డువేసుకున్నా ప్రమీల కళ్ళల్లో కన్నీటికి అడ్డుపడలేక పోయాడా దేవుడు.

మణమ్మ సమస్యకి ఆమె జుట్టు మూలంకాదు. అది తీసేసినంతమాత్రాన దానికి పరిష్కారమూ కాదని ప్రమీలకి అర్థమవుతోంది. కానీ చదువు సంధ్యా లోకజ్ఞానంలేని మణమ్మకి చెప్పడం ఎలా ? ఎలా ? మళ్ళీ నీ తలకట్టు మొలుచు కొస్తుంది. నీ సమస్య సమస్యగానే ఉంటుంది అయ్యో మణీ .... ఎంత పని చేశావు ? అలనాడు తన కొప్పుపట్టిన పురుషుణ్ణి మట్టుపెట్టిగానీ జుట్టుముడివేయని ద్రౌపది మనకి ఆదర్శమంటారు. కానీ, ఈనాడు మన స్థితి ఎంత తారుమారైంది మణీ .... నీకెలా చెప్పను ఇవన్నీ ? నీకెలా అర్థమవుతాయి ఇవన్నీ ? ప్రమీల మనస్సు కలగాపులగంగా రోదిస్తోంది.

జూలై '82 (విపుల)